జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ కరీంనగర్
సోమవారం 25 మార్చి 2024 www.ntnews.com





## జీవితం.. వర్ణ రంజితం

నేడు హోలీ

హోలికి మరోపేరు వసంతకేళి. వసంతం అంటే పలురంగుల కలయిక. సున్నం పసుపు కలిపితే ఎరుపు తయారయ్యే పద్ధతిని వసంతం అంటారు. హోలీ సందర్భంగా రంగులు చల్లుకోవడమనే సంప్రదాయం గురించి తాత్త్వికంగా విచారిస్తే మానవ జీవితం సప్తవర్ణ సమన్వితం. ఒక్కో రంగు ఒక్కో భావానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. మానవ చేతనలో ఆలోచనలపై రంగులు ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి.

- ఎరుపు అన్ని వర్ణాల కన్నా ఎక్కువగా ఉత్తేజాన్నిస్తుంది. ఉత్సాహభరితమైనది ఏదైనా ఎరుపు రంగులో ఉంటుంది.
- మన అవగాహనకు మించినది ఏదైనా, సాధారణంగా నీలం రంగులో ఉంటుంది. అది సముద్రం అయినా, ఆకాశం అయినా సరే.
- ఆధ్యాత్మిక మార్గంలో నడిచే వ్యక్తులు నారింజ రంగును ఎంచుకుంటారు. యోగసాధనలో ఆజ్ఞా చక్రం కదులుతున్నప్పుడు, అది నారింజ రంగులో ఉంటుంది.
- శరీరంలో అత్యంత ప్రాథమిక చక్రమైన మూలాధారం వర్ణం పసుపు.
- పసుపు-నీలం నుంచి జనించేది ఆకుపచ్చ. హరిత వర్ణం ప్రశాంతమైన మనసుతో స్పష్టతను అందిస్తుంది. పచ్చ.. వృద్ధి, పునరుద్ధరణ, శాంతిని తెలియజేస్తుంది.
- తెలుపు నుంచే అన్ని రంగులూ ఉద్భవిస్తాయి. తెలుపు పవిత్రతను, శాంతిని, స్వచ్ఛతను తెలుపుతుంది.

... శ్రీ



ఇస్లాం బోధ

## అల్లాహ్ మాట.. పవిత్రమైన బాట

ఖురాన్ అంటే పఠించునది అని శాబ్దిక భావం. అంటే నిత్యపఠనానికి ఉపయోగించే పాఠ్య గ్రంథం. ఖురాన్‌లో ఈ గ్రంథాన్ని మరో నాలుగు పేర్లతో పేర్కొన్నారు. అవి అల్ ఫుర్ఖాన్ (మంచీ చెడుల మధ్య విచక్షణ చేసి చూపేది), అల్ హుదా (మార్గదర్శిని), అన్ నూర్ (వెలుగు నింపేది), అల్ కితాబ్ (మహత్తర గ్రంథం). ఈ పవిత్ర గ్రంథం ఆవిష్కృతమైన నెల రంజాన్.

ఖురాన్ గ్రంథ జ్ఞానాన్ని ముహమ్మద్ ప్రవక్త మనో ఫలకంపై అవతరించిన శుభమాసమే రంజాన్. సమస్త దుఃఖాలను, కమ్ముకొని ఉన్న కారుచీకట్లను దూరం చేసి వెలుగులు ప్రసరింపజేసే మార్గదర్శిని ఇది. 'ఖురాన్ చదవడం అంటే అల్లాహ్ మాటలను వినడమే'అంటారు ఉలేమాలు. అల్లాహ్‌ను ఎలా వేడుకోవాలి, ఏం వేడుకోవాలి అనే విషయాలను ఖురాన్‌లో స్పష్టంగా వివరించాడు ప్రభువు. ఖురాన్ అవతరించిన ఈ రంజాన్ మాసంలో కనీసం ఒక్కసారైన ఈ గ్రంథాన్ని చదవాలి, వినాలన్న నిబంధనను ముస్లింలు తప్పకుండా పాటిస్తారు.

ఖురాన్ జీవన విలువల దిక్సూచి. దైవభీతినీ, జీవన రీతినీ తెలుపుతుంది. మనో వ్యాధులకు దివ్య ఔషధం ఈ గ్రంథం. వ్యక్తివికాసాన్ని అందించే సాధనం. 'ఎవరైతే నా తాడు (ఖురాన్)ను గట్టిగా పట్టుకుంటారో వారు ఎన్నటికీ విఫలం కారు' అంటాడు అల్లాహ్. ఖురాన్‌లోని బోధలు ఆత్మగౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయి. అల్లాహ్ ఆదేశాలను తెలియజేయడానికీ, ఆయన అభీష్టాలు అర్థం చేసుకోవడానికి దివ్య ఖురాన్ అవతరించింది. ఈ పవిత్ర గ్రంథం మార్గ నిర్దేశనంలో అల్లాహ్ ఆదేశాలను ఆచరించి ఆయన ప్రసన్నతను పొందే ప్రయత్నం చేయాలి. ఏ పనులు వద్దని వారించడం జరిగిందో వాటికి దూరంగా ఉండి, అల్లాహ్ ఆగ్రహం నుంచి రక్షణ పొందే ప్రయత్నం చేయాలి.

### ఖురాన్‌లోని బోధలు

- మంచిపనులు చేసేవారు.. పురుషులైనా, స్త్రీలైనా వారు విశ్వాసులైతే స్వర్గంలో ప్రవేశిస్తారు. వారికి రవ్వంత అన్యాయం కూడా జరగదు. (4:124)
- అనాథల ఆస్తిని అన్యాయంగా తినేవారు.. తమ పొట్టలను అగ్నితో నింపుకొంటారు. వారు తప్పకుండా మండే నరకాగ్నిలోకి తోయబడతారు. (4:10)
- న్యాయానికి సాక్షులుగా ఉండండి. (ఏదైనా) వర్గంతో ఉన్న వైరం కారణంగా మీరు ఆవేశానికి లోనై న్యాయాన్ని త్యజించకండి. న్యాయం చెయ్యండి. ఇది దైవభక్తికి సరిసమానమైనది. (5:8)

... ముహమ్మద్ ముజాహిద్, 96406 22076

కలియుగంలో సంకీర్తన ఉద్యమానికి నాంది పలికిన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు మేలిమి బంగారు ఛాయతో అవతరించిన కృష్ణ అవతారం. చైతన్య మహాప్రభు అవతరించిన ఫాల్గుణ పౌర్ణమి గౌర పౌర్ణమిగా జరుపుకొంటారు. శ్రీమద్భాగవతం, మహాభారతం, వాయు పురాణం, నృసింహ పురాణం, చైతన్యోపనిషత్తు (అథర్వ వేదం) మొదలైన శాస్త్రాలన్నీ ఈ కలియుగంలో అవతరించే శ్రీకృష్ణుడి అవతార స్వరూపాన్ని గురించి స్పష్టంగా తెలియజేశాయి.

## కృష్ణ చైతన్యం

నేడు గౌర పౌర్ణమి



కలియుగంలో భగవంతుడు అవతరించడం ఎంతో విశిష్టతతో కూడిన విషయమే అయినా, ఆ అవతార స్వరూపాన్ని గురించి పరిజ్ఞానం మాత్రం లోకంలో చాలా అరుదు. వారే శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు. వీరిని 'గౌర హరి', 'గౌరాంగ', 'గౌర సుందర' అని కూడా సంబోధిస్తారు. సాక్షాత్తు శ్రీకృష్ణుడే గౌరాంగుడిగా అవతరించారు. దీనిని ధ్రువీకరించేలా శ్రీమద్భాగవతం మహాప్రభు అవతారాన్ని ఇలా వివరించింది.

**కృష్ణ వర్ణం త్విశాకృష్ణం సంగోపంగాస్త్ర పార్శదమ్**
**యజ్ఞైః సంకీర్తన ప్రాయైర్ యజంతి హి సుమేధసః**
(శ్రీమద్భాగవతము 11.5.32)

'ఈ కలియుగంలో ఆవిర్భవించి, సదా కృష్ణ నామాన్ని గానం చేసే భగవత్ అవతార మూర్తిని... మేధోసంపత్తి కలిగిన మనుషులు సామూహిక సంకీర్తనలతో ఆరాధిస్తారు. తన వర్ణం నలుపు కాకపోయినా, అతను సాక్షాత్తూ శ్రీకృష్ణుడే. ఆయన సంకీర్తన ఉద్యమాన్ని స్థాపించడానికి తన అనుచరులతో కలిసి ఈ భూమిపై అవతరిస్తారు'.

సంభవామి యుగే యుగే
దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు ప్రతియుగంలోనూ అవతరిస్తాడని శ్రీమద్భాగవతం చెబుతున్నది.

**ఆసన్వర్ణాస్త్రయో హ్యస్య గృష్ణతోఽనుయుగం తనూః।**
**శుక్లో రక్తస్తథా పీత ఇదానీం కృష్ణతాం గతః॥**
(శ్రీమద్భాగవతం 10.8.13)

'ఈ యశోదా తనయుడు ఒక్కో యుగంలో ఒక్కో రంగుతో కూడిన శరీరాన్ని కలిగి ఉండేవాడు. ఒకప్పుడు శుక్ల, ఇంకొకప్పుడు రక్త, ఇంకొకప్పుడు పీత వర్ణంతో ఉన్న ఇతడు ఇప్పుడు (ద్వాపర యుగంలో) నలుపు వర్ణం పొందాడు.'

పై శ్లోకానికి హరేకృష్ణ ఉద్యమ సంస్థాపక ఆచార్యులైన భక్తివేదాంత స్వామి ప్రభుపాదులు ఇలా వ్యాఖ్యానించారు. 'శ్రీమద్భాగవతంలోని పై శ్లోకము శ్రీకృష్ణుడి నామకరణ సమయంలో గర్గముని చెప్పినది. ఇతర యుగాల్లో శ్రీకృష్ణుడి అవతారాలు తెలుపు, ఎరుపు, పీత (పసుపు) వర్ణాలతో కూడినవ'ని గర్గ మునులు ఇక్కడ వివరించారు. వీటిలోని పీత వర్ణం శ్రీచైతన్య మహాప్రభువుల అవతార స్వరూపాన్ని వివరిస్తుంది. అంటే, గత కల్పాలలోని కలియుగాల్లో సైతం భగవంతుడు పసుపు వర్ణంతో అవతరించాడు అనటాన్ని ఇది నిరూపిస్తున్నది. భగవంతుడు వివిధ యుగాల్లో వివిధ వర్ణాకృతులలో అవతరిస్తారు. ఆ విధంగా, పీత వర్ణం సహా వివిధ భగవత్ అవతార సంబంధిత గుణాలతో భగవంతుడు శ్రీచైతన్య మహాప్రభువుగా అవతరించారని ప్రామాణికమైన సకల వైదిక శాస్త్రాలు నిర్ధారించాయి' అని ప్రభుపాదులు విశ్లేషించారు.

విష్ణు సహస్ర నామాల్లోని '**సువర్ణ వర్ణో హేమాంగో వరాంగ శ్చన్దనాంగదీ, వీరహా విషమ శ్శూన్యో ఘృతాశీ రచలశ్చలః**' శ్రీ చైతన్య మహాప్రభు అవతారాన్ని స్పష్టం చేస్తుంది. 'మేలిమి బంగారు వర్ణ ఛాయతో అవతరించి, ముందుగా గృహస్థుడిగా పలు లీలలు చూపుతాడు. అత్యంత సుందరమైన దేహాంగాలతో కూడి చందన లేపనం కలిగి సువర్ణ శోభతో ప్రకాశిస్తాడు. తర్వాతి లీలల్లో సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించి నిష్ఠాపరుడై, శాంత స్వభావంతో మెలుగుతాడు. భక్తి, సామర్థ్యం కలిగి తానే ఒక దివ్య సన్నిధానమై అభక్తులకు వాగ్బంధనం చేస్తాడు' అని పై శ్లోకానికి వివరణ.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు హరినామ సంకీర్తనాన్ని కలియుగంలోని ప్రధాన ముక్తిమార్గంగా ప్రబోధించిన భాగవతోత్తముడు. భగవంతునిపై ప్రేమను పెంపొందించుకోవడమే జీవన సాఫల్యానికి అత్యున్నత మార్గం. అందుకు సరళమైన విధానాన్ని బోధించడానికి కలియుగంలో అవతరించిన పరమ కారుణ్యమూర్తి శ్రీ చైతన్య మహాప్రభు. సుమారు 500 సంవత్సరాల కిందట పశ్చిమ బెంగాల్ నవద్వీప ధామంలో శచీ తనయుడై అవతరించిన మహాప్రభు భగవన్నామ సంకీర్తనమనే యజ్ఞంతో యుగధర్మాన్ని స్థాపించారు.

లక్షలాది గౌడీయ వైష్ణవులకు, హరేకృష్ణ భక్తి మార్గ అనుచరులకు గౌర పూర్ణిమ అంటే నూతన సంవత్సర ఆరంభం. గౌరాబ్ద శకం 538వది అయిన ఈ సంవత్సరం పరమ పవిత్రమైన శ్రీకృష్ణ దివ్యనామాన్ని సేవించడానికి మరో సదవకాశాన్ని అందిస్తున్నది. కలియుగంలో ముక్తిని పొందడానికి, యుగధర్మమైన హరినామ సంకీర్తనను బోధిస్తూ, శ్రీ చైతన్య మహాప్రభువు ప్రత్యేకంగా కింది మహామంత్రాన్ని జపించమని మనకు అందించారు. అదే 'హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరే హరే। హరే రామ హరేరామ రామ రామ హరే హరే॥' శ్రీచైతన్య మహాప్రభువు చిత్రపటాన్ని ముందు ఉంచి, నిత్యం 108 సార్లు ఈ హరేకృష్ణ మంత్రాన్ని జపిస్తే, వారు కలియుగ భవసాగరాన్ని సులభంగా దాటి తప్పకుండా శ్రీకృష్ణుడిని చేరగలుగుతారు.

... శ్రీమాన్ సత్యగౌర చంద్రదాస ప్రభూజి, 93969 56984

కథాసుధ

## వ్యామోహం

ఒకానొక గ్రామంలో ఓ స్థితిమంతుడైన వ్యాపారి ఉండేవాడు. అతను ఇక సంపాదించింది చాలనుకున్నాడు. తన శేష జీవితాన్ని మానవ సేవ చేయడానికి వినియోగించాలని భావించాడు. వృద్ధులకు, రోగులకు ఆశ్రయమిచ్చే ఓ ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడి గురువుతో తన ఆలోచన గురించి చెప్పాడు. అతణ్ని గురువు అభినందించాడు. 'ఓ మూడు రోజులపాటు ఆశ్రమంలో ఉండి, ఆ తర్వాత సేవ చేసే నిర్ణయం తీసుకో'మన్నాడు. గురువు చెప్పినట్లే ఆ వ్యాపారి ఆశ్రమ వాతావరణాన్ని పరిశీలించాడు. సేవా బృందాలతో కలిసి మాట్లాడాడు. మూడోరోజు గురువు ఆ వ్యాపారిని పిలిచి 'సేవ చేయడానికి సిద్ధమా?' అని అడిగాడు. 'అంతకు మించిన భాగ్యమా!' అని బదులిచ్చాడు వ్యాపారి. తర్వాత వ్యాపారిని ఆశ్రమంలోని వేంకటేశ్వరస్వామి గుడి దగ్గరికి వెళ్లి స్వామివారి మూర్తి ముందు నిల్చుని ఫొటో తీసుకోమన్నాడు గురువు. గంట తర్వాత వ్యాపారికి ఫొటో ఇచ్చాడు గురువు. ఆ చిత్తరువును వ్యాపారి ఆసక్తిగా గమనించసాగాడు. కాసేపటికి గురువు 'స్వామితో దిగిన ఫొటోలో మీరు మొదటగా స్వామిని చూశారా, లేక మిమ్మల్ని మీరు చూసుకున్నారా?' అని వ్యాపారిని ప్రశ్నించాడు. 'నన్నే చూసుకున్నాను' అని అతను బదులిచ్చాడు. గురువు చిన్నగా నవ్వి.. 'అన్నీ వదిలేశావన్నావే! కానీ, నీపై నీకున్న వ్యామోహాన్ని ఇంకా వదులుకోలేదు. అందుకే ఆ బ్రహ్మాండనాయకుడైన శ్రీనివాసుడి పక్కన నిలబడి దిగిన ఫొటోలో.. ముందు స్వామిని కాకుండా, నిన్ను నువ్వు చూసుకున్నావు. సేవ చేయాలనే ఆసక్తి ఒక్కటీ ఉంటే సరిపోదు. ముందుగా వ్యామోహాన్ని త్యజించాలి. అదే సేవ చేయడానికి తొలిమెట్టు' అని చెప్పాడు. వ్యామోహాన్ని విసర్జిస్తే గానీ, పూర్తిగా సేవ చేయలేమని తెలుసుకున్నాడు వ్యాపారి.


... ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

# కన్నయ్య నిజంగా వెన్నదొంగా?

## గోపికలు యశోదతో... ఓ ఇందు వదనా!

మీకు సంపద ఎక్కువగా ఉంటే మిక్కిలి మక్కువతో ఇంపైన విందు భోజనాలు కుడువ- ఆరగించవచ్చు. మేలైన పుట్టములు- పట్టు పీతాంబరాలు కట్టుకోవచ్చు. అంతేకాని, సుంతైనా దయ లేకుండా మీ సంతానాన్ని మా వంటి బడుగుల- పేదల ఇళ్లపైకి వదలి పెట్టడం, మేము ఇడుములు- బాధలు పడుతూ ఉంటే కళ్లప్పగించి చూస్తూ నవ్వి ఊరుకోవడం- ఇది ఏమి మంచి పద్ధతి తల్లీ!





మన పోతన మధురిమ 165 వ భాగం

**కం॥ 'ఓ యమ్మ! నీ కుమారుడు**
**మా యిండ్లను బాలుఁ బెరుఁగు మననీడమ్మా**
**పోయెద మెక్కడికైనను**
**మా యన్నల సురభులాన మంజులవాణీ!'**

ఓ నందరాణీ! చూడమ్మా, నీ బాలుడు మా ఇళ్లలో పాలు, పెరుగు బతకనివ్వడం లేదు. మా అన్నగారు నంద ప్రభువుల వారి ఆలమంద మీద ఒట్టు. ఓ మంజులవాణీ!- నీ వాక్చాతుర్యంతో- మెత్తని మాటలతో సర్దిపుచ్చాలని చూస్తావేమో! ఇక ఈ వాడలో మేము చస్తే ఉండలేం. ఈ ఊరు విడిచి మరో చోటికి వెళ్లాల్సిందే.

శుకుడు- పరీక్షిన్మహారాజా! 'నీ చిన్నవాడు మాయ నేర్చి.. కాని పనులు ఎన్నో చేయ పూనుచున్నాడ'ని గొల్ల పడుచులు గొల్లుమనగా, వారి మాటలన్నీ విన్న యశోద ఇలా అన్నది...

**కం॥ 'చన్ను విడిచి చనఁడిట్టటు**
**నెన్నఁడుఁ బొరుగిండ్ల త్రోవ లెరుఁగడు నేఁడుం**
**గన్నులు దెరవని మా యీ**
**చిన్ని కుమారుని రవ్వసేయందగునే?'**

వనితలారా! నా చిరుత- చిన్నవాడు నా ఒళ్లో కూర్చుని చన్నుపాలు తాగడం తప్ప నన్ను విడిచి ఎన్నడూ పక్కకైనా పోడు. మా కన్నయ్యకు ఇంకా పొరుగిళ్లు, తోవలు తెలియవే. ఈ నాటికీ కళ్లు కూడా సరిగా తెరవని పసివానిని పట్టుకొని ఇలా ఆరళ్లు (నిందలు) వేయడం మీకు తగునా?

**తే॥ 'అన్యమెరుఁగడు, తన యంత నాడు చుండు**
**మంచివాఁడీతఁడెగ్గులు మానరమ్మ!**
**రామలార! త్రిలోకాభిరామలార!**
**తల్లులార! గుణవతీమ తల్లులార!'**

'మా తనయునికి తాను తప్ప ఇతరమేమీ తెలియదు. ఏదో తనంత తాను ఆడుతూ తనలో తాను ఆనందిస్తూంటాడు. మావాడు ఎంతో బుద్ధిమంతుడు. అమ్మలారా! ముద్దుగుమ్మలారా! మీరందరూ సద్గుణవతులు. మూడు లోకాలలోనూ కడు అందగత్తెలు. ఇకనైనా మా కృష్ణచంద్రునిపై నిందలు మోపడం మాని మీ మీ మంద- వాడలకు మరలిపొండి. సతీమ తల్లులారా! మిమ్మల్ని బతిమాలుకుంటున్నా'.

శుకుడు- రాజా! యశోద గోపికలను సముదాయించి పంపిందే కాని, కొడుకును మాత్రం కోపించి మందలించలేకపోయింది. అండజయానలు- వ్రేతలు ఇకపై కూడా కొండెములు చెప్పకుండా ఉండలేకపోయారట! ఎందుకని? కామ జనకుడైన ఆ రామానుజుని వామ- సుందర రూపాన్ని ఆ గొల్ల భామలు వీక్షించకుండా ఉండలేరు కనుక! వాస్తవానికి ఎవరా వనితలు? 'గోప్యస్తు సురస్త్రియః, శ్రుతయో జ్ఞేయాః'- విబుధ వధువులు- దేవతా స్త్రీలు. శ్రుతులు- వేదమంత్ర స్వరూపిణులు. అందుకే ఈ ఇందు ముఖలందరూ ఏదో ఒక మిష- నెపంతో నందగృహానికి వచ్చి విషధరరిపు గమనుని- గరుడ వాహనుని, ఆ బాలముకుందుని తిలకించి మోహితులై పులకించిపోయేవారు.

ఇద్ధ (ప్రవిత) చరితుడు, సిద్ధపురుషుడూ అయిన పోతన పై తేటగీతిలో 'గీత'లోని 'మత్తః పరతరం న అన్యత్ కించిత్ అస్తి ధనంజయ'- అన్న శ్లోక తాత్పర్యాన్ని- ఉపనిషత్తుల పరమార్థమైన పరబ్రహ్మ స్వభావాన్ని నందగోపుని ఇల్లాలి ముఖతః అందంగా తేటతెల్లం చేశాడు. 'అన్య మెరుఁగడు'... సర్వం ఖల్విదం బ్రహ్మ, ఏకమేవా ద్వితీయం బ్రహ్మ (ఉపనిషత్తు), 'సర్వము తానయైన వాడు' (గజేంద్రస్తుతి)- అంతా తానే కాన తన కన్నా ఇతరమైనది ఏదీ లేదని తెలిసినవాడు. ద్రష్ట- చూసేవాడు, దృశ్యం- చూడబడేది.. రెండూ తానే అయినవాడు. 'తనయంత నాడుచుండు'.. 'ఆనందో బ్రహ్మ' (ఉపనిషత్తు) తాను ఆనంద స్వరూపుడు కాన, ఆత్మరతిః ఆత్మక్రీడః' (ఉపనిషత్తు).. తనతో తానే ఆడుకుంటూ ఆనందిస్తూ ఉంటాడు! స్థూల భక్తి కన్నా సూక్ష్మ మానసిక భక్తి (పరాపూజ) నూరు రెట్లు మిన్న అన్న శాస్త్ర వచనాన్ని అనుసరించి- తన భక్తులైన గోప గోపాంగనలకు 'వెన్నదొంగ' ఎప్పుడు ఎలా వస్తాడో కదా!- అన్న స్మరణ (సర్వేషు కాలేషు మాం అనుస్మర- గీత) తైలధార వలె ఎడతెగక కొనసాగునట్లు వారికి ధ్యాన పూర్వక మానసిక భక్తిని అనుగ్రహించాడు కన్నయ్య.


క్షీరం (పాలు) సత్త్వ గుణానికి, క్షీరసారం (వెన్న) జ్ఞానానికి ప్రతీకలు. పాలు వెన్నలు దేహానికి పుష్టి, తుష్టి కలిగించునట్లు జ్ఞానం ముముక్షు సాధకులకు ఆధ్యాత్మిక దృష్టిని ప్రసాదిస్తుంది. దృష్టిని జ్ఞానమయంగా చేసుకొని సృష్టిని బ్రహ్మమయంగా చూడమని శాస్త్ర ఆదేశం. 'సారగ్రాహీ జనార్దనః'- భగవంతుడు సారాన్ని స్వీకరించే శీలం- స్వభావం కలవాడు. 'శుభాంగో లోక సారంగః' అని విష్ణువుకు నామాలు. పాలసారం వెన్న. బాలకృష్ణుడు నవనీత ప్రియుడు. వెన్నను దొంగిలించైనా తింటాడు. చిన్నది కాని, పెద్దది కాని- ఏ కర్మ చేసినా, ఆ కర్మను చూడక దాని సారం గ్రహిస్తాడు. గోపికలు ఎంత ప్రేమతో వెన్న తినిపిస్తారో, ఆ ప్రేమ కావాలి పరమాత్మకి. కంసారి (కృష్ణుని) చరణకమల సంస్మరణమే సంసారంలోని సారం! భవసారం స్వీకరించి అనుభవించడమే సూరి- పండిత లక్షణం.

క్షీరసారాన్ని- వెన్నను ఆస్వాదించిన- అనుభవించిన పిమ్మట భాండమును (పాత్రను) పక్కన పెట్టినట్లు, మోక్ష కాముకులకు ఉండకూడని దేహభ్రాంతి (దేహమే నేను అను భ్రమ)ని తొలగించడానికి, ఆత్మానుభూతి పొందిన పిమ్మట డిందు- నశించు స్వభావం కల భాండం (కుండ) వంటి బొంది (దేహం) పట్ల క్షర- నశ్వర (నశించిపోయేదన్న) దృష్టి కలిగి ఉండాలని బోధించడానికి సంకేతంగా అఖండ బ్రహ్మాండాధిపతి భాండాలను బద్దలు చేసేవాడని 'భాండభేదన' లీలకు పరమార్థం! ఈ అవగాహన లేని అజ్ఞానులే అచ్యుతునిపై అభాండాలు వేస్తారు.

దశమ స్కంధం కృష్ణకథలో అధిక ఆక్షేపణకు, అపార్థానికి లోనైన ఘట్టాలు మూడు- నవనీత చౌర్యం, గోపీ వస్త్రాపహరణ, రాసలీల. ధర్మ స్వరూపుడు, ధర్మ కర్త, భర్త అయిన దేవదేవుడు దొంగతనం చేయడమేమిటి? అని అధిక్షేపించే వారి ఆశంక. జగత్తే రూపంగా కలిగిన జగన్నాథుడు భగవంతుడు చోరుడా? ఎంత అసంగతం, అనుచితం? ఎంత అజ్ఞాన విలసితమైన, ప్రజ్ఞా శూన్యమైన వింత ప్రలాపం! ఈ విశ్వంలో 'అంతర్బహిః'- లోపల, బయట ఆయన సొంతం కాని వస్తువు- కాదు కాదు, ఆయన కాని వస్తువు ఇసుమంతైనా ఉన్నదా? 'హరి మయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు సంశయము పనిలేదు. హరి మయము కాని ద్రవ్యము పరమాణువు లేదు'- (భాగవతం). పరమాత్మ దేనిని దొంగిలించాలి? తన స్వరూపాన్ని తానే తస్కరించడమా? అది సంభవమా? 'స ఏవ సృజ్యః స చ సర్గకర్తా'- (విష్ణు పురాణం). సృష్టీ తానే, స్రష్టా తానే. 'భ్రాజిష్ణుర్భోజనం భోక్తా'- భోజనం (అన్నం) తానే, భోక్తా (అన్నాదుడు) తానే! పరమాత్మ సృష్టించిన వస్తువులను తమవిగా భావించి, భగవత్సంపదను బలవంతంగా అపహరించి, ఆయన సంతతిని- వివిధ ప్రాణి వర్గాలను సంపద వంచితులుగా చేసే వారు తస్కరులు. ఆ ముష్కరు (కపటు)లే కదా శిక్షార్హులు? కన్నయ్య పాలు, పెరుగు, వెన్న దొంగిలించినా తను తిన్నది తక్కువ. పాడిపంటల భాగ్యానికి నోచుకోని కడు పేదబాలలకు తినిపించింది ఎక్కువ. రామావతారంలో సహకరించిన మర్కటాలకు కృతజ్ఞతగా పంచి పెట్టిందీ ఎక్కువే. నిజానికి మంద- గోకులంలో ఎవరి ఇంట్లో పాలు పెరుగు లేకపోయినా వాటిని నంద ప్రభువు గృహం నుండే ఉచితంగా పొందుతూ ఉండేవారు. శ్రుతు (వేదా)లే పరమాత్మని 'తస్కరపతి'గా నుతించాయి. ఎందువల్లనైనా 'వెన్నదొంగ' రాకపోతే ఇందువదనలు- గొల్ల వనితలు తల్లడిల్లిపోయేవారు. ఆ పల్లెటూరి పడుచులు, ఆ గొల్లభామలు నల్లవానిని చోరునిగా స్మరించినా శ్రేయస్సు- మోక్షం పొందారు. కాన, ఎలా చూచినా నవనీత గ్రహణం చౌర్యం కాదు.

బాలకృష్ణుడు గోపబాలల వెన్నలాంటి మానసాలు హరించిన 'చిత్తచోరుడు'! ఇంతాచేసి అప్పటికి కృష్ణునికి రెండు-మూడు ఏళ్లు! 'తనది కాని వస్తువును తనదని భావించి, దానిని స్వాధీనపరుచుకొని అనుభవించువాడు చోరుడు. పారమార్థికంగా... 'తాను నిత్యశుద్ధ బుద్ధ ముక్త సచ్చిదానంద స్వరూపుడు. తాను చైతన్యమే కాని జడము కాదు. తానుకాని దేహ, ఇంద్రియ, మనోబుద్ధులను తానని భ్రమించు అజ్ఞాని నిషిద్ధ కర్మలు చేసే చోర సమానుడు. 'నేను' అంటే ఎవరు? శుద్ధ చైతన్యమే 'నేను'. చైతన్యమైన ఆత్మదేవుడవు నీవు కానప్పుడు నీవే దొంగవు! నువ్వు చేసేదంతా చౌర్యమే! నువ్వు తినేదంతా పరుల సొమ్మే!' అని శంకర భగవత్పాదులు ఆధ్యాత్మిక చౌర్యాన్ని వివరించారు.

(సశేషం)



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
9866836006